భారం మోయలేం

- పెరిగిన కోడిగుడ్డు ధర
- విద్యార్థులకు పంపిణీ బంద్
- చేతులెత్తేసిన మధ్యాహ్న భోజన నిర్వాహకులు
- రెండు నెలలుగా పరిస్థితి
- ఉన్నతాధికారులకు వినతులు
- పట్టించుకోని వైనం



మానకొండూర్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించడంతో పాటు పోషక విలువలు కలిగిన కోడిగుడ్డును అందించాల్సి ఉండగా కోడిగుడ్డు రేటు పెరగడంతో ప్రభుత్వ విద్యార్థులకు రెండు నెలలుగా కోడిగడ్డు అందడం లేదు. కోడిగుడ్డు రేటు పెరిగిందని, అధిక రేటుకు కొనుగోలు చేస్తే నష్టపోవాల్సి వస్తోందని, మధ్యాహ్న భోజన నిర్వాహకులు కోడిగడ్డు విద్యార్థులకు పెట్టడం మానేశారు. కోడిగుడ్డు రేటు పెరగడం వల్ల మధ్యాహ్న భోజన నిర్వాహకులు నష్టపోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యాశాఖ ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా మారింది. ఒక్కో విద్యార్థికి వారానికి మూడు సార్లు కోడిగుడ్డు అందించాల్సి ఉంది. కోడిగుడ్డును అందించినందుకు మధ్యాహ్న భోజన నిర్వాహకులకు కోడిగుడ్డుపై ఐదు రూపాయలు చెల్లిస్తుండగా, ప్రస్తుతం కోడిగుడ్డు ధర ఏడు రూపాయలకు పెరిగింది. దీంతో ప్రతి విద్యార్థిపై రెండు రూపాయల అదనపు భారం అవుతుందని నిర్వాహకులు ఆందోళన చెందుతున్నారు. ఈ భారం మేము మోయలేమంటూ నిర్వాహకులు విద్యార్థులకు కోడిగుడ్డును అందజేయడం మానేశారు. విద్యార్థులకు పౌష్టికాహారం ఇవ్వాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అందిస్తున్న కోడిగుడ్డు అందకుండా పోతుంది.

ఉన్నతాధికారుల చర్యలు శూన్యం

కోడిగడ్డు రేటు పెరిగిందని, దీంతో నష్టపోవాల్సి వస్తోందని, విద్యార్థులకు కోడిగుడ్డు అందజేయలేమని విద్యాశాఖ ఉన్నతాధికారులకు వినతిపత్రం అందజేసినా రెండు నెలలుగా ఇదే పరిస్థితి. ప్రతీసారి కోడిగుడ్డు రేటు పెరగడం వల్ల విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో కోడిగుడ్డును అందజేయలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కోడిగుడ్డును ప్రభుత్వమే నేరుగా అందజేసేలా చూడాలని కోరుతున్నారు. లేదా పెరిగిన రేటుకు అనుగుణంగా బిల్లులు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

కోడిగుడ్డు పెట్టడం లేదు



డిసెంబర్ నుంచి మాకు కోడిగుడ్డు పెట్టడం లేదు. కోడిగుడ్డు ధర ఎక్కువగా ఉండటం వల్ల పెట్టడం లేదని తెలిసింది. కూరగాయలతో వండిన ఆహారం తింటున్నాం.

– ప్రణవి, తొమ్మిదో తరగతి, పచ్చునూర్

ప్రభుత్వమే సరఫరా చేయాలి



చాలీచాలని వేతనాలతో భోజనం వడ్డిస్తున్నాం. మార్కెట్లో కోడిగుడ్డు ఏడు రూపాయలు. ప్రభుత్వమే నేరుగా కోడిగుడ్లు సరఫరా చేయాలి, లేదంటే కోడిగుడ్డుకు అనుగుణంగా రేటు చెల్లించాలి.

– వనిత, మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు

నోటీస్‌లు ఇవ్వాలని చెప్పాం



కోడిగుడ్లు అందించడం లేదని హెచ్ఎం నిర్వాహకులకు నోటీస్ ఇవ్వాలని, నిర్వాహకులు ఇచ్చే సమాధాన లేఖ హెచ్ఎంలు వారివద్ద ఉంచుకోవాలని చెప్పాం.

– మధుసూదనాచారి, మండల విద్యాధికారి

క్లుప్తంగా

నియామకం



శాలువాతో సత్కరిస్తున్న నాయకులు

జమ్మికుంట: జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు, టీపీసీసీ ప్రచార కమిటీ ఎగ్జిక్యూటీవ్ మెంబర్‌గా సాయిని రవిని రాబోయే పార్లమెంట్ ఎన్నికల కోసం హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించారు. ఈసందర్భంగా పట్టణంలోని ఆయన స్వగృహంలో హుజూరాబాద్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు తేలుకుంట్ల ప్రశాంత్(సన్నీ) గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. నియామకం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ కార్యదర్శి బొమ్మిదేవి అజయ్, జిల్లా యువజన కాంగ్రెస్ కార్యదర్శి కుర్రి అభిషేక్, నాయకులు విన్ను, రాకేశ్, శ్రీకాంత్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

‘మాజీ సీఎం కేసీఆర్‌ను అగౌరవపరిస్తే సహించం’

హుజూరాబాద్: కాంగ్రెస్ నాయకులు మాజీ సీఎం కేసీఆర్‌ను అగౌరవపరిస్తే సహించేది లేదని ముదిరాజ్ మహాసభ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కొలిపాక సమ్మయ్య ముదిరాజ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ప్రాణాలను సైతం లెక్కచేయని గొప్ప నాయకుడు కేసీఆర్ అని, అలాంటి వ్యక్తిని కించపరిచేలా మాట్లాడటం సరికాదన్నారు. ప్రతిపక్ష హోదాలో 39 మంది ఎమ్మెల్యేలు ఉన్నారని, ఈ విషయాన్ని కాంగ్రెస్ గుర్తుంచుకోవాలన్నారు. కేసీఆర్ పట్ల కాంగ్రెస్ ప్రభుత్వ తీరు మార్చుకోక పోతే ఆందోళనలు చేపడతామన్నారు.

ఉచిత వైద్యశిబిరం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

హుజూరాబాద్: పట్టణంలోని హైస్కూల్ క్రీడా మైదానం ఆవరణలో కూరపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వరల్డ్ క్యాన్సర్ డే పురస్కరించుకొని గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 100 మందికి మధుమేహం, బీపీ పరీక్షలు చేసి ఆరోగ్య సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో హాకీ క్లబ్ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, కౌన్సిలర్లు తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, ముక్కా రమేశ్, డాక్టర్ కూరపాటి రమేశ్, రాధిక, హాస్పిటల్ అధికారి శ్రీకాంత్‌రెడ్డి, హుజూరాబాద్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

బాల్క సుమన్ దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

రామడుగు: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా గురువారం మండల కేంద్రంలో యువజన కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈసందర్భంగా రామడుగు పోలీస్‌స్టేషన్‌లో సుమన్‌పై ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు మామిడి దిలీప్‌కుమార్, పల్లె రాంరెడ్డి, బుర్ర శ్రీనివాస్‌గౌడ్, అనుపురం పర్శరాం, స్వామి, జవ్వాజీ అజయ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అయోధ్యకు తరలిన బీజేపీ శ్రేణులు



జెండా ఊపుతున్న గంగాడి కృష్ణారెడ్డి

హుజూరాబాద్: అయోధ్యలోని శ్రీరాముడి ఆలయాన్ని దర్శించుకునేందుకు గురువారం పట్టణానికి చెందిన బీజేపీ శ్రేణులు కాజీపేట రైల్వే స్టేషన్ నుంచి తరలివెళ్లారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి కాషాయ జెండా ఊపి సాగనంపారు. ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ అసెంబ్లీ కన్వీనర్ మాడ గౌతమ్‌రెడ్డి, స్టేట్ కౌన్సిల్ మెంబర్ పుప్పాల రఘు, వరంగల్ జిల్లా మహిళా మోర్చా నాయకురాలు కవిత గీత, సంతోష్, పట్టణ అధ్యక్షుడు గంగిశెట్టి రాజు, ప్రధాన కార్యదర్శి వొడ్నాల విజయ్, అంకతి వాసు, శిథర్, తూర్పాటి రాజు, ప్రభాకర్, కొలిపాక శ్రీనివాస్, సుధాకర్ రావు తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ వినియోగదారుల సదస్సు

మానకొండూర్: మండలంలోని చెంజర్ల విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శుక్రవారం విద్యుత్ వినియోగదారుల సదస్సు నిర్వహిస్తున్నట్లు సీజీఆర్ఎఫ్ 1 చైర్‌పర్సన్ కె. తిర్మల్‌రావు ప్రకటనలో తెలిపారు. లోకల్ కోర్టులో విద్యుత్ సమస్యలు, విద్యుత్ పునరుద్ధరణ, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు మార్చటం, హెచ్చుతగ్గులు, డిస్ట్రిబ్యూషన్ సిస్టం పెంపుదల, లోపాలు ఉన్న మీటర్లు, నూతన సర్వీసుల మంజూరు, అదనపు లోడ్ క్రమబద్ధీకరణ, సర్వీస్ రద్దు, కేటగిరి మార్పు, తదితర సమస్యలపై విద్యుత్ వినియోగదారులు ఉదయం 10.30 గంటల నుంచి ఒంటిగంట వరకు ఫిర్యాదు చేయవచ్చని కోరారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రూ. 54 వేల విరాళం



విరాళం అందిస్తున్న మునీందర్ దంపతులు

చొప్పదండి: పట్టణంలోని శ్రీవేంకటేశ్వర మణికంఠ ఆలయంలో అయ్యప్ప మాలధారణ భక్తులకు అన్నదానం కోసం ఆలయ కమిటీకి పట్టణానికి చెందిన ఎన్నం మునీందర్, పద్మ దంపతులు గురువారం రూ. 54,116 విరాళం అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బొడిగె వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి చేపూరి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు బొడిగె వెంకన్న, మాజీ అధ్యక్షుడు పొరండ్ల భాస్కర్, కోశాధికారి దండె సత్యానందం, కార్యదర్శి ఉస్కె రాజశేఖర్‌రెడ్డి, పిట్టల సాయి, ఎన్నం శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పన్నులు చెల్లించకుంటే ఆస్తులు జప్తు



పన్నులు వసూలు చేస్తున్న మున్సిపల్ కమిషనర్

చొప్పదండి: పురపాలక సంఘం పన్నులను చెల్లించనివారి నుంచి బకాయిలను మున్సిపల్ చట్టం 2019 ప్రకారం తెలంగాణ రెవెన్యూ రికవరీ యాక్టు చట్టం నిబంధనలను అనుసరించి ఆస్తులు జప్తు చేసే అధికారం ఉందని మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్ అన్నారు. పట్టణంలోని పలు వార్డుల్లో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పన్నుల వసూలుపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పలు దుకాణాల నుంచి పన్నులు వసూలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పట్టణ ప్రజల విజ్ఞప్తి మేరకు భువన్ యాప్ ద్వారా పెరిగిన పన్నులను తగ్గించేందుకు మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం చేసిందన్నారు. తీర్మానం కలెక్టర్ కార్యాలయానికి పంపించగా కార్యాలయం నుంచి గెజిట్ వచ్చిందన్నారు. గెజిట్‌ను రాష్ట్ర పురపాలకశాఖ సంచాలకులకు, హైదరాబాద్‌కు పంపించామని తెలిపారు. అక్కడ ఆస్తిపన్నుల స్లాబులు తగ్గించాక పెరిగిన పన్నులు తగ్గుతాయన్నారు. ప్రస్తుతం 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పన్నులను చెల్లించాలని, లేదంటే రెండు శాతం వడ్డీ పడుతుందని తెలిపారు. ముఖ్యంగా బకాయిలు చెల్లించని నివాస, వాణిజ్య గృహాలు, రైస్‌మిల్లులు, స్కూళ్లు, కళాశాలల ఆస్తులను జప్తు చేస్తామని తెలిపారు. వెంట మున్సిపల్ మేనేజర్ ప్రశాంత్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ కమిషన్‌కు ఫిర్యాదు



వినతిపత్రం అందజేస్తున్న సంజయ్

మానకొండూర్: తప్పుడు కులధ్రువీకరణ పత్రాలు సమర్పించి మానకొండూర్ ఎంపీపీగా ముద్దసాని సులోచన ఎన్నికయ్యారని ఢిల్లీలోని జాతీయ బీసీ కమిషన్ చైర్మన్‌కు రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘ కోఆర్డినేటర్ జక్కని సంజయ్‌కుమార్ గురువారం ఫిర్యాదు చేశారు. ఎంపీపీ సులోచన తండ్రి ఓసీ కులానికి చెందిన వారని, ఎన్నికల అఫిడవిట్‌లో మాత్రం బీసీ కులానికి చెందినవాడని కులధ్రువీకరణ పత్రం అందజేసి ఎంపీపీగా ఎన్నికయ్యారని, తప్పుడు పత్రాలు సమర్పించి ఎన్నికైన ఎంపీపీపై చర్యలు తీసుకోవాలని కోరారు.

కొత్తపల్లి ఎస్సైగా సాంబమూర్తి

కొత్తపల్లి: కొత్తపల్లి ఎస్సైగా ఎస్.సాంబమూర్తిని నియమిస్తూ సీపీ అభిషేక్ మహంతి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పని చేస్తున్న డి.చంద్రశేఖర్ వీఆర్ కరీంనగర్‌కు బదిలీ అయ్యారు. టాస్క్‌ఫోర్స్‌లో పని చేస్తున్న సాంబమూర్తిని కొత్తపల్లి ఠాణాకు బదిలీ చేశారు. కాగా, ఆయన శనివారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

నూతన కార్యవర్గం

కరీంనగర్‌రూరల్: జిల్లా ఫ్లవర్ డెకరేషన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని గురువారం కరీంనగర్‌లో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆది శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా ఎనగందుల రమేశ్, కోశాధికారిగా కోన శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా దబీర్, తుమ్మల మధు, ప్రచార కార్యదర్శిగా బొమ్మిడి రాజేందర్ ఇతర కార్యవర్గసభ్యులు ఎన్నికయ్యారు. వ్యవస్థాపక అధ్యక్షుడు అలిపిరెడ్డి చంద్రమౌళి, గౌరవ అధ్యక్షుడు బొమ్మిడి కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

‘బ్లూబెల్స్’ ప్రతిభ

సప్తగిరికాలనీ: కరీంనగర్ హనుమాన్ నగర్‌లోని బ్లూబెల్స్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఇటీవల నిర్వహించిన జిల్లాస్థాయి సాంఘిక శాస్త్ర ప్రతిభా పోటీల్లో పలు విభాగాల్లో విజేతలుగా నిలిచారు. చరిష్మా ద్వితీయ, ఆశిష్, సాయి స్నిద్ధారెడ్డి తృతీయ స్థానం సాధించి, ఈ నెల 10న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులను కరస్పాండెంట్ సునీత, టీచర్లు అభినందించారు.

యువకుడి అరెస్టు

కరీంనగర్ క్రైం: గంజాయి కేసులో ఒక యువకుడిని అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సరిలాల్ తెలిపారు. నగరంలోని భగత్‌నగర్‌కు చెందిన ముస్కనిపేట ఆశిష్‌కుమార్ గంజాయి విక్రయించే వ్యక్తికి సహకరించిన కేసులో ఉన్నాడన్నారు. గురువారం రిమాండ్‌కు తరలించామన్నారు.

మహదేవపూర్‌కు చెందిన దొంగ..

పలు ఇళ్లలో చోరీలకు పాల్పడిన దొంగను అరెస్టు చేసినట్లు కరీంనగర్ వన్‌టౌన్ ఎస్సై రవికుమార్ తెలిపారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్‌కు చెందిన రౌతు పవన్‌పై కరీంనగర్ వన్ టౌన్, త్రీటౌన్ పరిధిలో చోరీ కేసులు నమోదయ్యాయని అన్నారు. అతన్ని గురువారం అరెస్టు చేశారు. 2 సెల్‌ఫోన్లు, ఒక ట్యాబ్, రూ.9 వేలు స్వాధీనం చేసుకొని, రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

గోపాల్‌రావుపేటలో క్రికెట్ పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న సత్యప్రసన్న

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే ఏపీఎల్ సీజన్–4 గ్రేస్‌బాల్ క్రికెట్ పోటీలను గురువారం మాజీ సర్పంచ్ కర్ర సత్యప్రసన్న ప్రారంభించారు. నాలుగు జట్లు పోటీల్లో పాల్గొంటుండగ, శ్రీప్రగతి, అక్షర, నేచర్ యూత్ క్లబ్‌వారు టీ షర్ట్స్ అందజేశారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు రేణుకుంట అశోక్, టోర్నీ ఆర్గనైజర్స్ శ్రీకాంత్, రవిశాస్త్రి, హరికృష్ణ, సంతు, రవి, మల్లయ్య, అరుణ్, శ్రీనివాస్ పలువురు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలతోనే అభివృద్ధి



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

కరీంనగర్‌రూరల్: కేంద్ర ప్రభుత్వ పథకాలతోనే గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నాయని బీజేపీ కరీంనగర్ మండల అధ్యక్షుడు మాడిశెట్టి సంతోష్‌కుమార్ అన్నారు. పల్లెకు పోదాం కార్యక్రమంలో భాగంగా బీజేపీ నాయకులు గురువారం ఎలబోతారంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర నిధులతోనే పంచాయతీల్లో పాలన జరిగిందన్నారు. ఎంపీ బండి సంజయ్‌కుమార్ తీసుకువచ్చిన స్మార్ట్‌సిటీ నిధులతో కరీంనగర్ ఎంతో అభివృద్ధి చెందుతోందని తెలిపారు. తీగలగుట్టపల్లి వద్ద ఆర్వోబీ నిర్మాణం జరుగుతోందన్నారు. కేంద్ర పథకాలను గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేసి, రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ విజయానికి కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు. రాత్రి ఓ కార్యకర్త ఇంట్లో భోజనం చేసి, అక్కడే నిద్రించారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గాండ్ల గోపాల్, నాయకులు ఎం.దేవేందర్, కొమురయ్య, ధర్మయ్య, ఆంజనేయులు, రవి, సాగర్, నగేశ్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికురాలికి బ్యాగు అప్పగింత



బ్యాగు అప్పగిస్తున్న అధికారులు

విద్యానగర్: ఆర్టీసీ కరీంనగర్–1 డిపోకు చెందిన బస్సులో బుధవారం ప్రయాణించిన కొదురుపాకకు చెందిన భార్గవి తన బ్యాగు మర్చిపోయింది. దాన్ని ఆన్ డ్యూటీ కండక్టర్ జె.గంగాధర్, కానిస్టేబల్ ఎండీ.అఫారొజుద్దీన్ గుర్తించి, ఎర్నింగ్ సెక్షన్‌లో అప్పగించారు. ఆ బ్యాగులో రూ.35 వేలు, దుస్తులు ఉన్నాయి. బాధితురాలు గురువారం అధికారులను సంప్రదించగా వివరాలను తెలుసుకొని, బ్యాగు అప్పగించారు. ఈ కార్యక్రమంలో ఎర్నింగ్ డీసీ ఇ.బి.రావు, ఆర్టీసీ హెడ్ కానిస్టేబుల్ లక్ష్మీరాజం, డ్యూటీ కంట్రోలర్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలపై విద్యార్థులకు అవగాహన

కరీంనగర్ క్రైం: కరీంనగర్‌లోని అల్ఫోర్స్ పాఠశాల విద్యార్థులకు గురువారం ట్రాఫిక్ నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ నర్సర్ మాట్లాడుతూ.. విద్యార్థులు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కలిగి ఉండటం ఎంతో అవసరమన్నారు. వాటిని పాటించడం వల్ల కలిగే ప్రయోజనాలు, పాటించకపోతే సంభవించే ప్రమాదాలను వివరించారు. ఇన్‌స్పెక్టర్లు రమేశ్, కరీముల్లాఖాన్, అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘శక్తి సూపర్ షీ’ జిల్లా కో–ఆర్డినేటర్ నియామకం



అనూష

కరీంనగర్: శక్తి సూపర్ షీ యూత్ కాంగ్రెస్ మహిళా విభాగం జిల్లా కో–ఆర్డినేటర్‌గా రామడుగు మండలంలోని కిష్టాపూర్‌కు చెందిన వేల్పుల అనూష(న్యాయవాది)ను నియమిస్తూ నేషనల్ ప్రెసిడెంట్ బి.వి.శ్రీనివాస్, తెలంగాణ యూత్ కాంగ్రెస్ స్టేట్ ఇన్‌చార్జి సురభి దివేది గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా అనూష మాట్లాడుతూ.. యూత్ కాంగ్రెస్ మహిళా విభాగాన్ని పటిష్టం చేస్తూ సోనియాగాంధీ, రాహుల్‌గాంధీల ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్తానని తెలిపారు.

పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలి



మాట్లాడుతున్న ఎంపీవో రాజేశ్వర్‌రావు

మానకొండూర్: గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని ఎంపీవో రాజేశ్వర్‌రావు అన్నారు. మండలంలోని శంషాబాద్ గ్రామాన్ని గురువారం సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామంలో తాగునీరు అందించేందుకు పైపులైన్ వ్యవస్థ మెరుగుపరుచుకోవాలని మరమ్మతులను ముందుగా గుర్తించాలని సూచించారు. మురుగుకాలువల్లో చెత్తాచెదారం లేకుండా చూసుకోవాలని, వీధి దీపాలు వెలిగేలా చూసుకోవాలన్నారు. వారం రోజుల పాటు అధికారులు గ్రామాల్లోనే ఉంటూ పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ శిరీష, ఎంపీటీసీ నర్సింగరావు, మాజీ సర్పంచ్, రమేశ్, కార్యదర్శి ప్రసూన, తదితరులు పాల్గొన్నారు.

పార్కింగ్‌కు నిలయంగా బస్టాండ్



బస్టాండ్‌లో పార్కింగ్ చేసిన వాహనాలు

శంకరపట్నం: మండలంలోని తాడికల్ బస్టాండ్‌లో వాహనాలు, సైకిళ్లు పార్కింగ్ చేయడంతో ప్రయాణికులు రోడ్డుపైనే నిల్చుంటున్నారు. ఎండలు తీవ్రమవుతుండటంతో కరీంనగర్–వరంగల్ వైపు వెళ్లే ప్రయాణికులు బస్సుల కోసం బస్టాండ్‌లోకి వెళ్లకుండా రోడ్డుపైనే పడిగాపులు కాస్తూ ఎదురు చూడాల్సిన పరిస్థితి. సంబంధిత అధికారులు స్పందించి ప్రయాణికులు కూర్చుండే విధంగా ఏర్పాట్లు చేయాలని స్థానికులు కోరుతున్నారు. మండలంలోని కొత్తగట్టు బస్టాండ్ రోడ్డు వెడల్పు పనుల్లో భాగంగా పోతుండటంతో ప్రయాణికులు అవస్థలు పడే అవకాశం ఉంది. రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్న కాంట్రాక్టర్, అధికారులు స్పందించి బస్టాండ్‌ను నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు. మొలంగూర్ గ్రామంలోని బస్సుషెల్టర్ కూడా రోడ్డు విస్తరణలో భాగంగా కూల్చివేసే అవకాశం ఉన్నందున అక్కడ సైతం నూతన బస్టాండ్‌ను నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

బస్ షెల్టర్ గోడ కూల్చివేతపై విచారణ



అధికారులతో మాట్లాడుతున్న మాజీ సర్పంచ్

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలోని మొగ్దుంపూర్‌లో బస్‌షెల్టర్ పునఃనిర్మాణ పనులు నిలిపివేయడంపై ఆర్టీసీ డీఈ లక్ష్మారెడ్డి విచారణ చేపట్టారు. కొన్ని రోజులుగా పనులు జరుగుతుండగా బుధవారం ఓ వ్యక్తి అడ్డుకొని, గోడను కూల్చివేశాడు. దీనిపై ఆర్టీసీ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కూల్చివేసిన గోడను డీఈ గురువారం పరిశీలించారు. పనులు అడ్డుకున్నవారికి సంబంధిత స్థలంతో ఎలాంటి సంబంధం లేదని మాజీ సర్పంచ్ జక్కం నర్సయ్య తెలిపారు. ప్రజల సౌకర్యార్థం నిర్మిస్తున్న బస్‌షెల్టర్‌ను వెంటనే పూర్తి చేయాలని కోరారు. అనంతరం డీఈ కరీంనగర్ రూరల్ ఎస్సై రాజుతో ఫోన్‌లో మాట్లాడారు. శుక్రవారం నుంచి పనులను చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. మాజీ ఉప సర్పంచు కూకట్ల తిరుపతి, స్థానిక నాయకులు నాగరాజు, భూమయ్య, అశోక్, శివరామకృష్ణ, సాయిలు తదితరులున్నారు.